నేడు కర్మన్‌ఘాట్‌లో మహిళా దినోత్సవం

కాచిగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీబీజీఎఫ్ వనితా విభాగ్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు విబిజీ ఫౌండర్ మడిపడిగే రాజు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి

–కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవానికి ప్రభుత్వం తరఫున వెళ్లిన దళిత డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను నేలపై కూర్చోబెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వారి సతీమణులు సైతం కుర్చీలో కూర్చొని వివక్ష పాటించారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. ఇది వారి అగ్రకుల దురహంకారానికి నిదర్శనమని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించకుండా అవమానించిన ఈవోపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదలను ఆదుకున్న ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ మండల కార్యాలయంలో 13 షాదీముబారక్, ఏడు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు గెలుచుకొని సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో చిరుప్రాణులను కాపాడాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వేసవి ఎండలు ముదురుతున్నందున చిరుప్రాణులైన పిచ్చుకలు, పావురాలు, కుక్కపిల్లలు వంటి మూగజీవాలకు మానవతాదృక్పథంతో మంచినీటిని ఏర్పాటు చేసి కాపాడుకోవాలని ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి కోరారు. అందుకు ప్రభుత్వం కూడా తమవంతు సహకారం అందించాలన్నారు. పిడికెడు గింజలు, గిన్నెడు నీళ్లు పోసి వాటి ప్రాణాలను కాపాడాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చిరుప్రాణుల కోసం నీటితొట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రత్నానగర్ బస్తీ అధ్యక్షుడిగా కిషోర్ కుమార్



ఎంబీ కిషోర్ కుమార్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ రత్నానగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎంబీ కిషోర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రాము యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శిగా వీరయ్య గౌడ్, కోశాధికారిగా పి.వెంకటేష్ ఎన్నికయ్యారు. గెలుపొందినవారు స్థానిక అమ్మవారి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు నూతన కార్యవర్గాన్ని పూలమాలలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

టీఓబీసీఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదయ్య నియామకం



టీఓబీసీఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం యాదయ్యకు నియామక పత్రం అందజేసి సన్మానిస్తున్న ఫెడరేషన్ అధ్యక్షుడు ధానకర్ణ చారి

నల్లకుంట: తెలంగాణ ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్(టీఓబీసీఈఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యూనియన్ బ్యాంక్ ఉద్యోగి అల్లం యాదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు వి.దానకర్ణాచారి, ప్రధాన కార్యదర్శి జి.పాండు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన యూనియన్ పెద్దలకు యాదయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఓబీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చడానికి చర్యలు తీసుకోవాలి



కాచిగూడ: పర్యావరణ సమతుల్యతలో కీలకభూమిక పోషించే పశుపక్ష్యాదులు, వన్యప్రాణులు వేసవి బారిన పడకుండా తగినంత మేర నీటి సదుపాయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అడవుల్లో నీరులేక వన్యప్రాణులు అలమటిస్తున్నాయనే పత్రికల కథనాల నేపథ్యంలో తక్షణమే మూగజీవాల గురించి ఆలోచించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పక్షుల కోసం కార్యాలయాల భవనాలపైన, ఆవరణల్లో, వీధికుక్కల కోసం ఇళ్ల వద్ద చిన్న, చిన్న నీటి తొట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యుద్ధప్రాతిపదికన రహదారుల ఆధునీకరణ

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోడ్ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదినక అభివృద్ధి పరుస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మా నగర్‌లో రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. భోలక్‌పూర్‌లో ఇప్పటికే మంచినీరు, డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. మహాత్మానగర్‌లో వాంబే ఇండ్ల సమస్యను పరిష్కరించి స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, కార్పొరేటర్ గౌస్‌ఉద్దీన్

తీవ్ర అనారోగ్యానికి గురైన బీఆర్ఎస్ నాయకుడు పండరీనాథ్ కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ అలీ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు మున్వర్‌చాంద్, లోకేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: ఆడబిడ్డల పెళ్లికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారాక్ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం పరిధిలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారాక్ పథకాల కింద 53 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చొరవ తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, తహసీల్దార్ మీరాబాయి, డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ హాజీ తదితరుల పాల్గొన్నారు.

మాతా వాకర్స్ క్లబ్ అన్నదానం



వీఎస్‌టీలని కట్టమైసమ్మ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న మాతావాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ సేవయే మాధవ సేవ అని మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం అన్నారు. సోమవారం వీఎస్‌టీలోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద మాతా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 450 మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం సామూహిక గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ లింగప్రకాష్, మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడు, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి కోనేరు జైహింద్, సలహాదారులు డాక్టర్ శరత్‌కుమార్ జహార్‌కర్, ఉపాధ్యక్షులు వెంకట్, విశ్వనాథ శాస్త్రి, డాక్టర్ నీలా శ్రీధర్, వినోద్‌కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

–సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న బంటా యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌ముదిరాజ్, జయేందర్‌బాబు

కవాడిగూడ: రాష్ట్రంలో పదేళ్లు అధికారం అనుభవించి అధికారం కోల్పోయిన నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రులు కేటీఆర్, హరీష్ రావులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి వారికి లేదని సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంటా యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షులు ఆర్‌కే శ్రీనివాస్‌ముదిరాజ్, పార్టీ సీనియర్ నేతలు జి.జయేందర్‌బాబు అన్నారు. తమ ఉనికి చాటుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డిపై చౌకబారు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ ఆంధ్రోళ్ల బూట్లు నాకి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని ఆరోపణలు చేయడం తగదని, వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ నేతలు అడ్డదారుల్లో అధికారంలోకి రావడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజల చేతుల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలకు ఘోర పరాభావం తప్పదని అన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అతిథులతో కలిసి నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ తదితరులు

నల్లకుంట: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని చాత్తాద శ్రీ వైష్ణవ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. సోమవారం నల్లకుంట నర్మదాభవన్‌లో గల చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వ్యాస రచన, ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బిక్కుమళ్ల నిర్మలా మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్ లక్ష్మీ వేణుగోపాల్, అశ్వాపురం అరవింద్, తిరునగరి గోదావరి విజేతలకు బహుమతులు అందజేశారు. నిరుపేదలైన ఐదుగురు మహిళలకు సంఘం తరఫున కుట్టు మిషన్లు, నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. క్యాక్రమంలో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు పుష్పాంజలి, సునంద, లక్ష్మి, మాధవి, డాక్టర్ లలిత, హరిత జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ వేడుకలకు హాజరైన చాత్తాద శ్రీ వైష్ణవ మహిళలు

జర్నలిస్ట్స్ హౌసింగ్ సభ్యత్వ నమోదు గడువు పొడిగింపు

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. శివరాత్రి, శని, ఆదివారాల్లో బ్యాంకులు పనిచేయని కారణంగా చాలామంది జర్నలిస్టులు డీడీలు తీయలేకపోయారని, అందుకే మరో 3 రోజులు అవకాశం కల్పించినట్లు తెలిపారు. స్థానికంగా కనీసం ఐదేళ్లు జర్నలిస్టుగా పనిచేసిన సర్వీస్ ఆధారాలతోపాటు ప్రస్తుతం పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, ఐడీ కార్డు, అక్రెడిటేషన్ కార్డుతోపాటు స్థానిక నివాస ధ్రువీకరణపత్రం, రెండు ఫొటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని సూచించారు. వివరాలకు సెల్: 91009 33723, 93933 53519లలో సంప్రదించాలని సూచించారు.

నాణ్యతాప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అభివృద్ధి పనుల్లో ఎలాంటిలో లోటుపాట్లు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. అడిక్‌మెట డివిజన్ దీన్‌దయాళ్‌నగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో నాలా ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్, శ్యామ్ సుందర్ చిట్టి, అస్లాం, ఖదీర్, గురుదీప్‌సింగ్, మీడియా ఇంచార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, బలవంతు, జీహెచ్ఎంసీ డీఏ సన్నీ, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలి'



డీఎంసీకి వినతి పత్రం అందజేస్తున్న శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుదర్శన్

కాచిగూడ: జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ 16 పరిధిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్ సోమవారం డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సుదర్శన్ తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న ఫొటోలు తీసి తనకు పంపిస్తూ చర్యలు తీసుకోవాలని అంటున్నారని, కంప్లయింట్ ఇవ్వకుండా ఒత్తిడి చేస్తున్నారని సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ వివరణ ఇచ్చారు.

లింగ సమానత్వాన్ని పెంపొందించాలి



అంబేద్కర్ కళాశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లింగ సమానత్వాన్ని పెంపొందించడంలో ఉన్నత విద్యా సంస్థలు కీలకపాత్ర పోషించాలని అపోలో ఆసుపత్రి డైటీషియన్ డాక్టర్ కె.సౌమ్య అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళా ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ మహిళలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలని, ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ న్యూట్రిషన్ విభాగాధిపతి సి.ఆర్.కీర్తన, బి.అనూషా, అంబేద్కర్ విద్యా సంస్థల జాయింట్ డైరెక్టర్ రమణకుమార్, ఎన్.రిషికాంత్, ప్రిన్సిపల్ మట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత శ్రీకాంత్ ముదిరాజ్‌కు మాతృవియోగం



సుశీలమ్మ(ఫైల్)

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నగర నేత తలారి శ్రీకాంత్ ముదిరాజ్ తల్లి సుశీలమ్మ(75) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నేత ముఠా జైసింహ, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ట్రేడ్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, పూస గోరఖ్‌నాథ్‌లు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీకాంత్ ముదిరాజ్, అతని సోదరుడు వినోద్ ముదిరాజ్‌లను పరామర్శించారు.

దేశమంతా మోదీ కుటుంబమే..



అంబర్‌పేట్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు

అంబర్‌పేట్: విశాల భారతదేశాన్ని ప్రధాని మోదీ తన కుటుంబంగా భావించి అభివృద్ధి బాట పట్టిస్తున్నారని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో ప్రధానికి మద్దతుగా స్థానిక బీజేపీ నాయకులు చేపట్టిన తాము సైతం మోదీ కుటుంబంలో భాగమనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చుక్క జగన్, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంబర్‌పేట డివిజన్‌లో జరిగిన కార్యక్రమంల బీజేపీ డివిజన్ అధ్యక్షులు నాగభూషణంచారి, బిక్షపతి, యాదగిరి, యశ్వంత్, కృష్ణ ముదిరాజ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో ప్లకార్డులతో ప్రజలంతా మోదీ కుటుంబ సభ్యులే అని ప్రదర్శిస్తున్న గౌతంరావు తదితరులు

దేశ ప్రజలంతా మోదీ కుటుంబసభ్యులే..

కాచిగూడ: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చరిత్రాత్మకమైన నిర్ణయాలతో ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. సోమవారం బర్కత్‌పుర చౌరస్తాలో ప్రధాని మోదీకి మద్దతుగా ప్రజలంతా మోదీ కుటుంబ సభ్యులే అని ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్, బీజేపీ నేతలు సి.నందకిషోర్ యాదవ్, రవీందర్, శిర్ సాగర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఈశ్వరమ్మవాడలో సౌకర్యాల కల్పనకు చర్యలు

– ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న బస్తీ కమిటీ నాయకులు

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో బస్తీలు, కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. సోమవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని ఈశ్వరమ్మవాడలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర చేసి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు తమ బస్తీలో పురాతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల వల్ల నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లడం, నల్లాల్లో కలుషిత నీటిసరఫరా అవుతుందని దీని వల్ల ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులకు ఈశ్వరమ్మవాడ బస్తీ కమిటీ అధ్యక్షుడు చింతలకుమార్ యాదవ్, చైర్మన్ జగన్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు సురేష్‌గౌడ్, వి.సంతోష్, చింతల హరీష్, నాయకులు రాజు, మహేందర్, రాకేష్, కృష్ణ వినతిపత్రం అందజేశారు. సూరజ్‌నగర్‌లో హుస్సేన్‌సాగర్ మూసీనాలా ప్రహరీ నిర్మాణ పనులు సందర్శించి వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహా, బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, బీఆర్ఎస్ నేతలు పానుగంటి ప్రభాకర్, సంతోష్, లడ్డు, ముచ్చకుర్తి ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జాన్‌బాబు

లెప్రసీ వ్యాధిపై అవగాహన

కాచిగూడ: ప్రపంచ లెప్రసీ నివారణ పక్షోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ సోమవారం కాచిగూడ, సుల్తాన్‌బజార్, కింగ్‌కోఠి తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ కుష్టువ్యాధి దేవుని శాపం కాదని, సాధారణ చర్మవ్యాధి మాత్రమేనని, ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రణ సాధ్యమేనని అన్నారు. స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. స్టేట్ లెప్రసీ ఆఫీసర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు, అడిషనల్ డీఎంహెచ్‌వో (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) డాక్టర్ నిర్మల్ ప్రభావతి, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, యూపీహెచ్‌సీ ఆర్‌హెచ్ఎఫ్‌డబ్ల్యూటీసీ డాక్టర్ మనోజ్ రెడ్డి, డీపీఎంఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల గర్జన పోస్టర్ ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన హక్కుల గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు తానూ నాయక్ 74వ వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే గిరిజన హక్కుల గర్జన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ధర్మానాయక్, ఆర్.శ్రీరామ్ నాయక్, ఎం.బాలునాయక్, పాండునాయక్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

కాచిగూడ: నేపాల్ దేశానికి ఉప ప్రధానమంత్రిగా ఉపేంద్ర యాదవ్ ప్రమాణ స్వీకారం చేయడంపట్ల అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి, యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ చిట్టబోయిన నందకిషోర్ యాదవ్ హర్షం ప్రకటించారు. యాదవ కులానికి చెందిన ఉపేంద్ర యాదవ్‌కు ఆ దేశ ప్రజలు సముచిత స్థానం కల్పించడం పట్ల ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఉపేంద్ర యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.